# సర్కారు

సీతయ్యశెట్టి కొడుకును అందరూ ముద్దుగా సర్కార్ అని పిలిచేవాళ్లు. ఏడవక్లాసు చదువుతున్న ఆ పిల్లవాడికి తోటి వాళ్లందరూ "సర్కార్ ఏంపేరోయ్! సర్కార్ అన్న పేరు మనుష్యులు పెట్టుకుంటారా?" అని గేలిచేసేవారు.

"ఏమో? ఈ పేరెందుకు పెట్టారో నాకు తెలియదు. మా నాయనను అడిగితే అది మంచిపేరురా" అంటాడు.

సర్కార్ చూడటానికి ఏమి ఎరగనివాడుగా కనబడతాడు గాని చాలా తెలివిగలవాడని స్కూల్లో పేరు. తోటిపిల్లలకు ఇంతో అంతో సహాయము చేస్తునే ఉంటాడు. తనకున్నదానిలోనుంచి ఇస్తాడు కనుక తాను సర్దుకుంటాడు.

సీతయ్యశెట్టి పెద్దలుఇచ్చిన చిన్నయింట్లో ఉంటున్నాడు. అతడు మిల్లు దగ్గర బియ్యపుబస్తాలు కొని అక్కడికక్కడే అమ్మి కమిషన్ డబ్బు జేబులో వేసుకుని ఇంటికి వచ్చేవాడు.

సర్కారు బాగా చదివి మార్కులు తెచ్చుకుంటున్నప్పటికీ సీతయ్యశెట్టి అతడిని ఇంటరుమీడియేట్ ప్యాసయిన తరువాత సెక్రెటేరియట్‌లో గుమస్తాపని ఇప్పించాడు. తండ్రి కెదురుచెప్పలేని సర్కార్ ఆ ఉద్యోగం చేసుకుంటూ తండ్రి చూపించిన పిల్లను పెళ్ళి చేసుకున్నాడు.

ఉద్యోగంలో చేరినప్పుడు "నీ జీతం ఇంట్లో ఇవ్వాలిరా. చిల్లర ఖర్చు చెయ్యకూడద"న్నాడు తండ్రి.

"మన యింటినుంచి సెక్రెటేరియట్ దూరంకదా. బస్సులోపోవాలి దానికి డబ్బుకావాలికదా నాన్నా" అంటే "నాయనా! సర్కారు, డబ్బు జాగ్రత్తగా ఖర్చు చేయమన్నానుగాని నడిచిపొమ్మని చెప్పలేదుగా? ఎంతకావాలో నీ ఖర్చులకు అంతే ఉంచుకో. చూడు కోడలుకూడావచ్చింది. దానికి తలలోకిపూలు, ఎప్పుడైనా ఒక సినేమా ఆ ఖర్చులక్కూడా ఉంచుకో" అనేవాడు.

సర్కారు ఆఫీసుపనులు ఆపిఉంచకుండా ఏరోజు కారోజు పనులు పూర్తి చేసుకుని మంచిపేరు తెచ్చుకుంటున్నాడు. ప్యూన్లదగ్గర్నుంచీ అందరి మర్యాదా మన్నన లందుకుంటున్నాడు.

అతడు మహమ్మదీయుల మాదిరిగా అనర్గళంగా ఉరుదూభాష మాట్లాడ గలడు. చాలామంది ఆఫీసర్లకు కుడిభుజంగా ఉంటాడు.

రోజులు గడుస్తున్నాయి అతడికొక కొడుకుకూడాపుట్టాడు. తాత సీతయ్య శెట్టి మనమడిని అపురూపంగా చూసుకుంటాడు. బొమ్మ కిందదించనే దించడు.

సర్కారుకు ముప్పైఏళ్లవయస్సులో నిజాంప్రభుత్వంపైన పోలీసు చర్య జరిగింది. ఆ సందర్భంలో చాలామంది మహమ్మదీయులు ఇళ్లూవాకిళ్లూ వదలిపెట్టి పాకిస్థాన్‌కి వెళ్లిపోయారు. కొందరు తమయిళ్ళను పరిస్థితులు ముంచుకువస్తున్నా యని చాలా చౌకధరకు అమ్ముకుపోయారు.

సర్కారు బస్సుదిగి యింటికి రావటానికి కొంతదూరం నడవవలసిఉంది. ప్రతిరోజూ ఒకేదారి వెంటనడిచి ఇంటికి చేరుకునేవాడు.

ప్రతిరోజూ అతడు నడిచి ఇంటికివచ్చే దారిలో ఒక పెద్దమేడ లోని యజమాని వాకిట్లోకుర్చీవేసుకుని ఒక్కడూ కూర్చుని దారినపోయేవాళ్లను చూస్తూ సిగరెట్ తాగుతూఉండేవాడు. అతడికి సమీపంలో చిన్నపిల్లలు ఆడుకుంటూ ఉండేవారు. ఈ దృశ్యాన్ని ప్రతిరోజూ సర్కారు చూస్తూ ఇల్లు చేరుకునేవాడు.

ఒకరోజున గేటుదగ్గరికి ఆయన వచ్చి లోపలికిరమ్మని పిలిచాడు సర్కారును.

సందేహించకుండా సర్కారు లోపలికి వెళ్లాడు.

''కూర్చోండి'' అంటూ ఒక కుర్చీని చూపించాడతడు.

''మీ రేంపనిచేస్తారు?'' చాలా నమ్రతతో అడిగాడు. చెప్పాడు సర్కారు.

''మీ రెక్కడ ఉంటారు?''

''ఇక్కడికి మూడో సందులో''

''మీరింతబాగా ఉర్దూభాష మాట్లాడుతున్నారు. ఎక్కడివారు?''

''నేను ఇక్కడివాడినే. మా పూర్వులు కూడా ఇక్కడివారే. అసలైన ముల్కీలు.

''అలాగా మీ తండ్రిగారు ఏంచేస్తారు?''

''మా నాయనగారు పెళ్ళిళ్ళకూ పెద్దపెద్ద ప్రయోజనాలకూ గిన్నెలు, సామగ్రి అద్దెకిస్తారు. మిల్లులో బియ్యంబస్తాలుకొని బైట అమ్ముతారు. ఏదో కొద్ది సంపాదన.''

"నాకు ఒక సహాయంకావాలి. మీరు చేసినాసరే-చేయించినాసరే మీ మాటలను బట్టిచూస్తే మీకు బాగా పరపతి ఉన్నట్లనిపిస్తోంది."

"అయ్యా, మేము అల్పజీవులం. రోజులుగడిచే సంపాదనేకాని - మూటలు కట్టే సంపాదనకాదు. అయినా తమకు నేనేం సహాయం చేయగలను? చెప్పండి."

''నేను చాలా ఆపదలోఉన్నాను. నన్ను ఈ ఆపదనుండి గట్టెక్కించాలి మీరే'' ఆ మాటలు అనేటప్పుడు అతడి ముఖం చాలా దీనంగాఉంది కళ్ళలో తడి మెరుస్తున్నది.

''మీ నాయనదగ్గరే ఉంటున్నారుకదా అయననుకూడా సంప్రతించి చూడండి'' ప్రాధేయపడినట్టుగా అన్నాడు.

"డబ్బు ఇబ్బందేనా? మీ కెంతకావాలి" సర్కారుకి అతడిబాధను చూడగానే తనకే ఆ ఆపదవచ్చినట్టు భావించుకుని బాధ పడ్డాడు.

"ఎంత ఎక్కువదొరికితే అంతమంచిది. కనీసం పదిహేను వేలయినా కావాలి" అంటూ అతడి ముఖంలోకి చూశాడు.

గతుక్కుమన్నాడు సర్కారు.

''నేను పిల్లలతో ప్రయాణంచెయ్యాలి. అక్కడ ఏదయినా నాకు పని దొరికేవరకు మేము జీవించాలి. కొత్త కాపరంపెట్టి పిల్లలు బ్రతుకుతెరవు చూసుకోవాలి'' అన్నాడు.

"పిల్లలలో పనిచేయగలిగిన వాళ్ళున్నారా?"

''ఇద్దరు మగపిల్లలు పన్నెండు, పధ్నాలుగేళ్ళ వాళ్ళున్నారు. ఇక్కడ

చదువుకుంటున్నారు. నాకు ఏదైనా ఉద్యోగం దొరికేవరకూ వాళ్లు ఏదైనా షాపుల్లో పనిచేస్తారు. అమ్మాయిలిద్దరినీ ఎంబ్రాయిడరీ సారిసెంటర్లలో ఎక్కడైనా పెడతాను. పైచిల్లరఖర్చులు గడిచిపోతుంటే ఒక యిల్లు అద్దెకుతీసుకుని దానిలోఉంటూ నేను ఉద్యోగ ప్రయత్నంచేస్తాను. హోటల్లో ఎంతకాలం ఉండగలము?" అన్నాడు. ఆయన పేరు మీర్ అమానుల్లాఖాను. ఆయన రెవెన్యూ డిపార్టుమెంట్‌లో సూపర్నెంటు.

సర్కారు ఆలోచిస్తున్నాడు. ఇతడి పరిస్థితి దయనీయంగాఉంది. బాగా బతికినవాడు రాజకీయ పరిస్థితులు మారగానే ఇతడి పరిస్థితికూడా మారింది. తన తండ్రినడిగితే ఇవ్వడు. ఆయన సాధారణంగా డబ్బువిషయం కాకపోయినా ఏ విషయంలోనూ కొత్తవాళ్లను నమ్మడు. అదీగాక-తన స్థితిగతులుకూడా ఘనమైనవికావు. అందుకే తనెవరికీ సహాయంచేయలేడు. తనెంత కష్టపడి అయినా సర్దుకుంటాడు. గాని-ఎవరి సహాయాన్ని అపేక్షించడు. తను వీలయినంతవరకు పైసపైస కూడబెట్టుకుంటూ వస్తున్నాడు.

"ఏమాలోచిస్తున్నారు? మీ కంత నమ్మకంలేకపోతే ఈ బిల్డింగ్ తాకట్టు పెడతాను. ఇది లక్షలు విలువచేసే బిల్డింగు. అయినా ఒక నెలకోసం తాకట్టు పెడతాను'' అన్నాడు. అతడికి తన గ్రామంలో పళ్లతోట ఉందట. "దానినమ్మి అప్పుతీరుస్తా" నంటున్నాడు.

"సాబ్, నేను ఆవిధంగా ఆలోచించటంలేదు. నాకు రెండురోజులటైమివ్వండి నేను ప్రయత్నం చేస్తాను.''

"ప్రయత్నంకాదు. తెచ్చియివ్వాలి. ఇక్కడిపరిస్థితి రాజకీయంగా చాలా తీవ్రంగాఉంది. నిన్న సలాంచేసినవాడు ఇవాళ తప్పించుకు తిరిగే పరిస్థితివచ్చింది. మీరు ఏవిధంగానయినా తెచ్చి యివ్వండి అన్నాడు మీర్ అమానుల్లాఖాను బ్రతిమిలాడుతూ.

తలఊపుతూ వెళ్ళాడు సర్కారు. ఆ రాత్రి ఈవిషయమే ఆలోచిస్తూ పడుకున్నాడు. అతడికి అమానుల్లాఖాను దీనవదనమే కంటిఎదుట ప్రత్యక్ష మవుతున్నది. ఒక రాత్రివేళ భార్య రూపసుందరినిలేపి ''నాకు ఒక నెల రోజులకొరకు నీ మొహరీలదండ యిస్తావా? దానివల్ల మనకు చాలా లాభము కలుగుతుంది.'' అని ఆమెను బుజ్జగించి, పొగడి, అనునయించి, చివరకు వేడుకున్నాడు.

ఆమెకు అతడిమాటమీద గౌరవముంది కాని "ఇది అన్నట్టు జరుగుతుందా? దీనితో ఏంచెయ్యబోతాడు ?" అన్న సందేహం కలిగినా ఎక్కువ జాప్యం చేయ కుండా పెట్టెలోనుంచి తీసియిస్తూ "బంగారంధర బాగాపెరిగింది. దీనిని చేయించి నప్పటికంటె రెట్టింపయిందని అందరూ అంటున్నారు. మీరు జాగ్రత్తగా నాకు తెచ్చి యివ్వమని" చేతిలో చెయ్యి వేయించుకుని మరీ ఇచ్చింది.

"రూపా ! చూడు, ఇంతకంటె నూరురెట్లు అధికంగా నీచేతిలో పెడతాను" అన్నాడు.

ఆమె పొంగిపోతూ సంతోషంతో ఇచ్చింది.

ఆ మరునాడే దానినమ్మజూపాడు. అతడు అనుకున్నదానికంటె అధి కంగా వచ్చింది. అమానుల్లాకు కావలసినది పదిహేనువేలే. అతడడిగినది లెక్క బెట్టి ఇచ్చాడు సర్కారు.

అమానుల్లా సంతోషంతో డబ్బుతీసుకుని "చూడండి, మీరు అడగంగానే డబ్బు చేతికందించి ఎంతో సహాయం చేశారు. మీరు ఇంత తొందరగా డబ్బు తెచ్చియిచ్చి నా సమస్యను తీరుస్తారనుకోలేదు. నేను మీకు ఒకనెల లోపల వచ్చి మీడబ్బు మీకు ఇవ్వలేకపోతే ఈ మేడ తీసుకోండి, రాసియిస్తాను. నేను వచ్చిన ట్లయితే మీడబ్బు మీకిస్తాను. నా యిల్లు నాకు ఇవ్వండి" అన్నాడు.

"అలా అయితే ఈ మాట కాగితమ్మీద రాసి యివ్వండి" అన్నాడు సర్కారు.

"నాకింత సహాయం చేసిన తరువాత నేను మాట తప్పను" అని కాగిత మ్మీద రాసి లోపలికివెళ్ళి ఇంట్లో అందరిచేత సంతకాలు పెట్టించి తీసుకు వచ్చాడు.

"మీరు క్షేమంగా వెళ్ళిరండి. నేను చేసినది గొప్ప ఉపకారమని మీరను కుంటున్నారు. అవసరము వచ్చినప్పుడు ఒకరికొకరు సహాయం చేసుకోవాలి. నా కెప్పుడయినా అవసరంవస్తే మీరు సహాయంచెయ్యరా ? చేస్తారనే నేననుకుంటాను. ఈ యింటికి సంబంధించిన కాగితాలు ఉంటే అవి కూడా ఇవ్వండి. ఎవరయినా వచ్చి అడిగితే చూపించటానికి. మీరు రాగానే మీకాగితాలు మీకిస్తాను" అన్నాడు.

"అవును మర్చిపోయాను. కాగితాలు దగ్గరలేకపోతే మునిసిపాలిటీ వాళ్ళు

వచ్చినప్పుడు చూపించమంటారు, మీ దగ్గరుంచుకోండి. ఇంకా నా సామాను సర్దుకుంటాను'' అని లేచాడు కుర్చీలోనుంచి.

ఆ రోజే మధ్యాహ్నపువేళ దగ్గరలో ఉన్న బ్యాంకిలో రూపసుందరి పేరు మీద ఎక్కౌంటు తెరిచి మిగిలిన ఏడువేలు బ్యాంకులో వేశాడు.

వారంరోజులు గడిచిన తరువాత సర్కారు ఒక ఆదివారం చీకటిపడిన తరువాత తను కొని వేసిన గాడ్రిజ్ తాళాలు తెరిచి ఇల్లంతా టార్చిదీపం వేసి చూశాడు. అమానుల్లా సామాన్లు లారీలోకి ఎక్కించుకున్న తరువాత ఇల్లుశుభ్రంగా ఊడ్పించి ఉంచాడు. ఆ ఇల్లు మహమ్మదీయుల ఇల్లు ఉన్నట్టు లేదు. కింద పెద్ద హాలు రెండువైపులా రెండేసి గదులు నీళ్ళగదులతోసహా ఉన్నాయి. వీటి వెనుక పెద్ద వరెండా ఉన్నది. ముందువైపుకూడా వరెండా ఉన్నది. ముందు వరెండాలో నుంచి పైకి మెట్లు ఉన్నాయి. కింద ఉన్నట్టే పైనకూడా ఉన్నది. పైనుంచి తలుపులు వేసుకుంటూ అతడు కిందికి వచ్చి తలుపులు తాళాలు వేశాడు.

వాకిట్లో గేటుకు దగ్గరగా గరాజిఉంది. దాని పక్కన డ్రైవరుకొక గది ఉంది. మరొక వైపున మూడుగదులు ఉన్న చిన్న యిల్లొకటి ఉంది.

రెండునెలలు గడిచిన తరువాత ఆ చుట్టుపక్కల ఇండ్లలో అమానుల్లాను గురించి వాకబుచేశాడు. కొందరు 'మాకు వాళ్ళసంగతే తెలియ'దన్నారు. కాని ఇద్దరు ముగ్గురు "ఆయనమీద కరప్షన్ కేసులు నాలుగు ఉన్నాయట. ఆఫీసులో కొందరి దగ్గర అప్పుచేశాడట. కొంత డిపార్టుమెంటు డబ్బు ఖర్చు పెట్టుకున్నాడట. దుకాణాలలో కూడా బాకీపడ్డాడట. ప్రభుత్వం మారిందికదండీ, ఇటువంటి వాళ్ళను ఉద్యోగాలలోనుండి తీసివేస్తారు. శిక్షకూడా పడవచ్చు" అన్నారు. "అందుకే రాత్రికిరాత్రే పారిపోయాడు'' అన్నారు వారిలో ఒకరు.

సర్కారు ఆఫీసుకు వెళ్ళినప్పుడు అక్కడ అనుకుంటున్నారు-"ఎవరయినా ఇళ్ళస్థలాలు, ఇళ్ళు కొనుకున్నప్పుడు వెంటనే రిజిస్టరు చేయించుకోవాలి, లేకపోతే ఇబ్బందులు వస్తాయని."

సర్కారు ఆలోచించాడు. అమానుల్లా వెళ్ళి రెండు నెలలయింది. ఇరుగు పొరుగులు చెప్పినట్టుగా ఏమయినా ఇబ్బందులు రావచ్చునని ఒకరోజు సెలవు తీసుకుని రిజిస్ట్రారు ఆఫీసులో గుమాస్తావంటి ఆయనను కలుసుకుని స్టాంపు కాగిత

మీ్మద రాసేవిధానం తెలుసుకున్నాడు. ఆ మరునాడు అదే ఆఫీసులో అసిస్టెంటు రిజిస్ట్రారు దగ్గరకు వెళ్ళి ఆ కాగితం చూపించి "ఇది సరిగ్గాఉందా ? లేక ఇంకా ఏమయినా చేర్చాలా ?" అని అడిగాడు. ఆయన దానిని కొంచెం మార్చి "సైపు చేయించి అమ్మేవాళ్ళను కొనేవాళ్ళనూ తీసుకురండి. ఆఫీసు ఉన్నరోజులలో పది గంటల తరువాత రండి, రిజిస్ట్రేషన్ చార్జెస్ ఉంటాయి. అమ్మేవాడు గాని కొనే వాడుగాని భరిస్తాడు" ఇక్కడ ప్యూన్లకూ వాళ్ళకూ ఈనాములుకూడా ఇస్తే సంతో షిస్తారు" అని చెప్పాడు.

ఆ మరునాడే బాగా ఉర్దూభాష మాట్లాడే ఒక తెలిసిన వ్యక్తికి మంచివేషం వేసి "ఆఫీసులో అడిగిన మాటకు మర్యాదగా జవాబు చెప్పు. నీ పేరు ఏమిటని అడిగితే నేను చెప్పిన పేరే చెప్పు ధైర్యంగా. ప్యూనులాగ కాకుండా దర్జాగా హోదాగల మనిషిగా కూర్చో"మని చెప్పాడు.

ఇంటికి వచ్చి భార్యకు "నా పేరు స్వర్ణముఖి, బెంగుళూరు" అని చెప్పు. మంచి చీరె కట్టుకో, మాట్లాడవలసిన మాటలు జాగ్రత్తగా మాట్లాడు" అని మరీ మరీ చెప్పి "నాతో బయలుదేరు'' అన్నాడు.

రెండు పార్టీలూ ఆఫీసుకు వెళ్ళిన తరువాత మొదట వీళ్ళదే రిజిస్టరుఅయింది. సాక్షుల సంతకాలు కూడా చేయించాడు. ప్యూన్లకు అనుకున్నట్టు ఈనాములు ఇచ్చాడు రిజిస్ట్రేషన్ ఖర్చులు కొన్నవారే భరించారు. ఆ యిల్లు ఎనభైవేలకు రిజిస్ట రయింది.

ఇంటికి వచ్చిన తరువాత మిగిలిన ఏడువేలలో రెండువేలు రిజిస్టరుచేసిన వ్యక్తికి ఇవ్వవలసి ఉంటుందని సర్కారు రూపసుందరికి చెప్పి చెక్కు రాయించి మరునాడు అతనికి ఇచ్చాడు. అతడు ముందుగా మాట ఇచ్చినట్టుగా నడుచుకు న్నాడు. ఒక్కమాట బైటికి రానివ్వలేదు. ఆ రెండు వేలకూ చాలా సంతోషించాడు. భార్యకు ఏదో ఆమెకిష్టమైన నగ చేయించాడు.

సర్కారు భార్యకూడా నోరు మెదపలేదు, చూస్తూ ఊరుకుంది. ఆ యిల్లు తన కాసుల పేరిచ్చినందువల్లనే తన పేరు మార్చి రిజిస్టరు చేయించాడని గ్రహిం చింది. తనలో తానే సంతోషించింది.

ఆ మరునాడే సాయంకాలపువేళ దాటిన తరువాత "స్వర్ణముఖి, బెంగుళూరు" అని రాతిపలకమీద చెక్కించి గేటుదగ్గర స్తంభానికి తాపించాడు.

మరుసటి నెలలో కిందిభాగంలో పప్పు, ఉప్పు, చింతపండు, మిరపకాయల దుకాణం పెట్టించాడు. అంతకుముందు శుక్రవారంనాడు ఇల్లు కడిగించి పెద్ద లక్ష్మీదేవి ఫొటో పెట్టి పూలహారం వేశాడు. రెండుపక్కలా దీపాలు వెలిగించాడు.

మేడమీద ఎలక్ట్రికల్ సామానుపెట్టి నమ్మకం గలవారికి రేట్లుచెప్పి ఆ వస్తువులను అమ్మమని నియోగించాడు. ప్రతిరోజు సాయంత్రము వస్తువులనమ్మిన డబ్బు తీసుకువెళ్ళేవాడు. వాళ్ళకు నెలజీతాలిచ్చేవాడు. కిందఉన్న మూడు గదుల్లోకి ముగ్గురిని అద్దెకుంచాడు.

ఈ విషయాలేమీ సీతయ్యశెట్టికి తెలియవు. మామూలుగా కొడుకు తన బస్సు ఖర్చులుంచుకుని మిగతా డబ్బు తండ్రికిచ్చేవాడు. అత్తగారికి తోడుగా ఇంటిపనులు చేసేది రూపసుందరి.

మామూలుగా రోజులు గడిచిపోతున్నాయి.

చాలామంది మహమ్మదీయ ఉద్యోగస్తులు ఎవరికీ చెప్పకుండా ఇళ్ళను ఇరుగుపొరుగులకు ఒప్పగించి రాత్రిళ్ళు ప్రయాణమై వెళ్ళిపోయారు.

మ్యునిసిపాలిటీవారు అటువంటి యిళ్ళను కనిపెట్టి తాళాలు వేశారు. కొందరు ఆ యిళ్ళలో నిర్భయంగా ఉండటం సాగించారు. కొందరు అతిచురుకుగా ఆ యిళ్ళను ఆక్రమించి తమ కనువైనట్టుగా మార్పులు చేసుకుని ఇంటికి రంగులు వేసి చుట్టూ తోటవేసుకున్నారు.

ప్రభుత్వానికి సంగతి తెలిసి ఊరు వదిలిపెట్టినవాళ్ళ ఇళ్ళను చూసి తగిన పరిష్కారమార్గాలు ఆలోచించటానికి ఒక శాఖను నెలకొల్పింది. ఆశాఖా ఆఫీసులలో పనిచేస్తూ పారిపోయిన వాళ్ళ లిస్టు తయారుచేసుకుని వాళ్ళ పేరున ఉన్న తోటలూ ఇళ్ళనూ ఆక్రమించింది.

ఇరుగు పొరుగులు "మనం కొనుక్కుంటే బాగుండేది. ఆ పారిపోయేవాళ్లు ముందుగా మనకు చెప్పి వెళ్తే బాగుండేది. ఇప్పుడనుకుని ఏంలాభం?" అనుకుని విచారపడేవారు.

ఒకటా రెండా, అలాంటి ఇళ్ళు? పెద్ద పెద్ద మేడలూ, మిద్దెలూ లెక్కలేనన్ని ఆ శాఖకింద చేర్చబడ్డాయి. ప్రజలపాల బడకపోయినా కొన్ని ఇళ్ళు మాత్రము ఆశాఖ క్రిందికి రాలేదు. గౌరవప్రతిపత్తి గలవారే ఆక్రమించుకున్నారు.

ఇక్కడ ఇళ్ళు వదలిపెట్టినవారు వెళ్ళినచోట ఇళ్లులేక నివాసయోగ్యమైనవి దొరక్క ఉసూరుమంటూ వాటిని తలుచుకుని బాధపడేవారెందరో?

ఇది వారుచేసిన దుష్కృత్యాల ఫలితమా లేక అన్యాయమా? ప్రజలకు లోతులు తెలియటం లేదు.

ఇక్కడి సంగతులన్నీ తెలుసుకుంటునే ఉన్నాడు అమానుల్లా. ఒకనాడు ఒక ఉత్తరం వచ్చింది సర్కార్‌కి.

ప్రియమిత్రమా!

నాకు అక్కడి సంగతులు ఎప్పటికప్పుడు తెలుస్తునే ఉన్నాయి. నా యిల్లు ప్రభుత్వం చేతిక్రిందికి పోకుండా ముందుగానే మీకు అమ్మినందుకు సంతోషపడుతున్నాను. చాల చౌకగా అమ్ముకొనవలసి వచ్చింది. మీరు ఆ యిల్లు అద్దెకిచ్చినా సులభంగా రెండువేల రూపాయలు వస్తాయి. నాకిక్కడ మంచి ఉద్యోగమే దొరికింది. పిల్లలు చదువుకుంటున్నారు. డబ్బు చాలటం లేదు. మీరు నాకు మిత్రులయినారు. కనుక నా పిల్లల చదువునిమిత్తం నెలకు వెయ్యిరూపాయలు కొంతకాలం పంపించమని కోరుతున్నాను. మీరు మరొకవిధంగా భావించకండి.

ఇట్లు
మీ ప్రియమిత్రుడు
అమానుల్లాఖాను

ఈ ఉత్తరం చదువుకొన్న సర్కార్‌కి ఎవరో వచ్చి గోతిలోకి తోసినట్లయింది.

అతడికి ఆ యింట్లో చేసే వ్యాపారంమీద వచ్చేరాబడి దుకాణంలో కూర్చునే వాళ్ళ జీతాలకే సరిపోతున్నది. ఆ గదులమీద వచ్చేది సంవత్సరానికి కట్టే ఇంటి పన్నుకు సరిపోతున్నది. అమానుల్లాకు నెలకు వెయ్యిరూపాయలు ఇచ్చేది ఎట్లా?

తనకు ఇంక్రిమెంట్సు వచ్చినా ప్రమోషను వచ్చినా తండ్రికి తన బస్సు ఖర్చులుంచుకుని ప్రతినెల జీతమివ్వవలసిందే. ఇక గత్యంతరంలేక దుకాణాలలో పనిచేసేవాళ్ళను సగంరోజు పనిచెయ్యమని చెప్పి సగంరోజు తను ఒక్కడే రెండూ చూసుకోవటం మొదలుపెట్టాడు.

నాలుగైదు నెలల తరువాత ఆ యిద్దరూ అసలు మానుకున్నారు.

ఇదంతా గ్రహించిన రూపలక్ష్మి "ఉదయమే లేచి వంటచేసి మీ నాయన గారికి భోజనంపెట్టి నేను టిఫిన్ కారియర్ తీసుకువెళ్ళి షాపులో కూర్చుంటాను. ధరల పట్టీ ఒకటి తయారుచేసి గోడకు తగిలించండి. సాయంత్రము ఇంటికి వచ్చేటప్పుడు ఆవక్కనే ఉన్న బ్యాంకులో డబ్బువేసి వస్తాను. ఇంటిపనులు చూసుకుంటూ ఈ షాపుపని నేనే చూసుకోగలను" అన్నది.

అందుకూ గత్యంతరం లేక సర్కార్ అంగీకరించవలసి వచ్చింది.

ఐదారు సంవత్సరాలకే అమానుల్లా చనిపోవటంతో అతడికి పంపించవల సిన వెయ్యిరూపాయలూ మిగులుతున్నాయి ఇప్పుడు.

సర్కార్ రిటైరయ్యే సమయానికి తండ్రి చనిపోవటమూ అతడి కుమారుడు బి.ఏ. పూర్తిచెయ్యటమూ ఒకసారే జరిగింది. ఆ యిల్లు తాతలనాడు కట్టిన చిన్న ఇల్లు అమ్మినందువల్ల వచ్చిన డబ్బుతో కొడుకును మేడమీది వ్యాపారం చూసు కొమ్మని దానికి పెట్టుబడి అధికంచేశాడు. మూడుగదుల యింట్లో తానుంటూ గరాజిని ఒక చిన్న కుటుంబానికి అద్దెకిచ్చి తాను మేడక్రింద వ్యాపారం చూసు కుంటున్నాడు.

అతడి బాల్యస్నేహితులు కలిసినప్పుడు "నీవు సర్కార్ అని పేరు పెట్టు కున్నావు గాని చేసేది శెట్టివ్యాపారమే కదరా !" అంటూ ఎగతాళి చేస్తూఉంటే అతడూ వాళ్ళతోపాటు నవ్వేవాడు.

కాని, "నాకు శెట్టికున్న ఉపాయాలు తెలియవు. నేను ఎందులో ఉన్నా నష్టమే గాని లాభం కలగటంలేదు" అనుకునేవాడు మనసులో.

అంతలో అతడి కొడుకు పోటీపరీక్షలకు చదువుతూ వ్యాపారాన్ని సరిగా చూడలేకపోయాడు. కొడుక్కు పెళ్ళికుదిరింది. ఫైనాన్సు కార్పొరేషన్‌లో ఉద్యోగి అయినాడు.

ఒకనాడు "నాన్నా, నీవు ఈ వ్యాపారంచేస్తుంటే నాకు అవమానంగా ఉంది. ఆ వ్యాపారం ఎత్తివేసి ఖాళీచెయ్యి, గరాజికూడా ఖాళీచెయ్యి, కారు కొంటాను" అన్నాడు.

మరికొన్నాళ్ళకు "మేడంతా మనమే ఉంచుకుందాము. మీ నాన్నా, అమ్మలను ఆ మూడుగదుల యింట్లోనే ఉండమనండి" అని కోడలన్నది.

సర్కార్ మనసులో అనుకున్నాడు. ఈ పరిస్థితులలో "నా మొహరీలదండ తీసుకున్నారు. నాది నాకివ్వండి, లేదా చేయించండి" అని మాత్రం భార్య అనలేదు.

"ఇదొక్కటే నా జీవితంలో గెలుపు" అనుకున్నాడు సామాన్యుడిగా మిగిలిన సర్కార్ నామధేయుడు.